నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరం

కాచిగూడ: నారాయణగూడలోని బాలానందం సంస్థలో మే 1వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు బాలానందం ట్రస్ట్ అధ్యక్షురాలు జె.వి.కామేశ్వరి తెలిపారు. నృత్యం, లలిత సంగీతం, నటన, చిత్రలేఖనం తదితర అంశాల్లో శిక్షణ తరగతులు ఉంటాయని అన్నారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 11 నుంచి సాయంత్రం 3:30 వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని ఆమె పేర్కొన్నారు. వివరాలకు బాలనందం కార్యాలయంలో లేదా ఫోన్: 040 2756 1443లో సంప్రదించాలని సూచించారు.

సీఎంను కలిసిన కాంగ్రెస్ నేతలు

కాచిగూడ: పార్టీకి కార్యకర్తలే ముఖ్యమని టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ అంబర్‌పేట నియోజకవర్గం సోషల్ మీడియా కో ఆర్డినేటర్ రాజ్ కిరణ్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి ప్రచారం నిర్వహించాలని సీఎం సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు క్రమశిక్షణ గల సైనికుల వలే పనిచేయాలని కోరారు. పార్టీ నేతలు, కార్యకర్తలు సత్యవీర్, పాండు, శ్రీనాథ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

దానంను కలిసిన కాంగ్రెస్ నేతలు



ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలు ఆ పార్టీ సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం అభ్యర్థి దానం నాగేందర్‌ను శనివారం కలిశారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో పార్లమెంటు ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధించడం ఖాయమని సీనియర్ నేతలు జీఎస్ కేశవ్, శ్రీరాముల యాదగిరి, ప్రొఫెసర్ కృష్ణారావు, కొండూరి ప్రసాద్‌యాదవ్, రాజుగౌడ్, నాగేంద్రప్రసాద్ తదితరులు తెలిపారు. ఇప్పటి నుంచే ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకూ తీసుకువెళ్లాలని దానం నాగేందర్ సూచించినట్లు తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు



ముషీరాబాద్: పదవ తరగతి పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 19 నుంచి ప్రారంభమైన పరీక్షలు ముషీరాబాద్ విద్యామండలి పరిధిలో 4878 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షలకు చివరి రోజు కావడంతో పరీక్షా హాల్ నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు తోటి స్నేహితులను కలిసి విషెష్ చెప్పుకున్నారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఈవో చిరంజీవి తెలిపారు.

జవాను నెల్లి రామకృష్ణ మృతిపట్ల సంతాపం



రామకృష్ణ ముదిరాజ్ (ఫైల్)

కాచిగూడ: దేశ సరిహద్దుల్లో శనివారం వీర మరణం పొందిన ఆర్మీ జవాన్ నెల్లి రామకృష్ణ ముదిరాజ్ మృతి పట్ల అఖిల భారత ముదిరాజ్ సంఘం జాతీయ అధ్యక్షుడు పొట్లకాయల వెంకటేష్ ముదిరాజ్ ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. నెల్లి రామకృష్ణ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబానికి మనో ధైర్యం కల్పించాలని భగవంతుడిని ప్రార్థించారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించిన డాక్టర్ రాకేష్

ముషీరాబాద్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని భోలక్‌పూర్‌లోని బైబిల్ హౌస్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బి.రాకేష్ అన్నారు. శనివారం సిద్ధిక్ నగర్‌లో సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ రెయిన్‌బో హోం, ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. దంత, కంటి పరీక్షలు, బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. రెయిన్‌బో హోం సీనియర్ మేనేజర్ శ్రీలత, కో ఆర్డినేటర్ క్రాంతి కిరణ్, ఎస్ఆర్‌డీ సంస్థ ప్రతినిధులు కిషోర్, ఇందిరాభారతి, శివరాణి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో రెండు ఆటోలు చోరీ

వెంగళరావునగర్: రెండు వేర్వేరు ఘటనల్లో ఆటోలు చోరీకి గురైన సంఘటనలు మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నాయి. పోలీసుల సమాచారం మేరకు... ఎల్లారెడ్డిగూడకు చెందిన మహ్మద్ రషీద్ ఆటో డ్రైవర్. ఈ నెల 28న తన ఆటోను ఇంటి నుంచి పెట్టి ఉదయం వచ్చి చూడగా కనిపించలేదు. యూసుఫ్‌గూడ బస్తీలో ఉండే ఎన్.రాజశేఖర్ యూ ట్యూబర్. ఈ నెల 27న సాయంత్రం తన ఆటోతో కృష్ణకాంత్ పార్క్‌కు వెళ్లి తన వాహనాన్ని రోడ్డుపక్కన నిలిపి పార్క్‌లోనికి వెళ్లాడు. కొంతసేపటికి తిరిగి బయటకు వచ్చి చూడగా అతని ఆటో కనిపించలేదు.

ల్యాప్‌టాప్ మాయం

తూర్పు గోదావరికి చెందిన నిమ్మకాయల ఎస్తేర్ రాణి సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ తన తండ్రి, సోదరుడితో కలిసి వీడియోగల్లీలో నివాసం ఉంటుంది. ఈ నెల 28న తన ల్యాప్‌టాప్‌ను తన గదిలో భద్రపరిచి తాళాలు వేసి, తాళాలను వాష్‌రూంలో దాచి బయటకు వెళ్లింది. 29న ఇంటికి వచ్చిన ఆమెకు ల్యాప్‌టాప్ కనిపించలేదు. దాంతో బాధితులు శనివారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సబ్సిడీపై కారు ఇప్పిస్తామని మోసగించిన వ్యక్తికి జైలు శిక్ష

చిక్కడపల్లి: తనకు సీఎం క్యాంప్ ఆఫీస్‌లో పరిచయాలు ఉన్నాయని, ఎర్టిగా కారు సబ్సిడీ ద్వారా ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తికి కోర్టు జడ్జి జైలు శిక్ష, జరిమానా విధించారని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య తెలిపారు. వివరాలివీ... కె.హరిహరరావు అనే వ్యక్తి చిక్కడపల్లికి చెందిన కె.కుమార్ నుంచి రూ. 8.50 లక్షలు తీసుకుని కారు ఇప్పించలేదు. తీసుకున్న డబ్బులు ఇవ్వక పోవడంతో బాధితుడు చిక్కడపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని నాంపల్లి కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. నిందితుడు హరిహరరావు నేరం రుజువు కావడంతో ఆయనకు ఐదు సంవత్సరాల శిక్ష, రూ. 5 వేల జరిమానా విధించారని ఇన్‌స్పెక్టర్ సీతయ్య వివరించారు.

గీత దాటొద్దు..!

పార్టీలు.. నాయకులకు మార్గదర్శకాలు

- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎన్నికల సంఘం జారీ
- కోడ్ అమలుతో ఎన్నికల నిబంధనలు పాటించాలని ఆదేశం



సాక్షి, మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రచార పర్వం, సభల్లో ఎన్నికల ప్రవర్తన, నియమావళిని అనుసరించి రాజకీయ పార్టీలు, నాయకులు, అభ్యర్థులకు జిల్లా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేసింది. వీటిని ఖచ్చితంగా పాటించాలని సూచించింది. ప్రచారం, సభల్లో రాజకీయ పార్టీ, నాయకులు కుల, మత, భాష ద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయవద్దని పేర్కొంది. ఎన్నికల ప్రచారంలో విధానాలు, పథకాలు, కార్యక్రమాలపై మాత్రమే విమర్శలుండాలని తెలిపింది.

- వ్యక్తిగత జీవితంపై విమర్శలు చేయకూడదని పేర్కొంది. కుల, మత ప్రాతిపదికన ఓట్లు అడగడం, మందిరాలు, మసీదులు, చర్చిలు, ఇతర ప్రార్థన ప్రదేశాలను ఎన్నికల ప్రచారానికి వాడుకోవద్దని నిర్దేశించింది. ఓటు కోసం డబ్బులు ఇవ్వడం, బెదిరించటం నిషేధం.
- ఒక వ్యక్తి ఓటును మరొక వ్యక్తి వేయడం చట్ట వ్యతిరేకమని తెలిపింది. సంబంధిత వ్యక్తుల అనుమతి లేనిదే వాళ్ల భూములు, భవనాలను ప్రచారానికి ఉపయోగించకూడదని పేర్కొంది. ఇతర పార్టీల ఎన్నికల ప్రచారాలు, సమావేశాలకు ఆటంకం కలిగించకూడదని, ఎన్నికల ప్రచార సమావేశాలకు పోలీసుల నుంచి ముందుగా లిఖితపూర్వకంగా అనుమతి పొందాలని సూచించింది.
- ఆంక్షలున్న ప్రదేశాల్లో సమావేశాలు నిర్వహించకూడదని తెలిపింది. ఎన్నికల సమావేశాల్లో మైక్, లౌడ్ స్పీకర్ల వినియోగానికి ముందుగా అనుమతి పొందాలని, సమావేశానికి ఎవరైనా ఆటంకం కలిగిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని పేర్కొంది.
- ఊరేగింపులు, ప్రదర్శనల రూటు మ్యాప్‌ను ముందుగానే పోలీసులకు తెలపాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఊరేగింపులు, ప్రదర్శనలు నిర్వహించాలని సూచించింది. ఎన్నికల ప్రచారంలో ఎలాంటి దిష్టిబొమ్మల దహనం చేయరాదని పేర్కొంది. మంత్రులు పోలింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించకూడదని, అధికార పార్టీ నేతలు ఎన్నికల ప్రచారాన్ని అధికారిక పర్యటనలతో కలిపి చేయరాదని పేర్కొంది.
- అధికార యంత్రాంగాన్ని కూడా వాడుకోవద్దని సూచించింది. ప్రభుత్వ వాహనాలు వాడకూడదని పేర్కొంది. అతిథి గృహాలు అందరికీ ఇవ్వాలని, వీటిపై ఎవరి పెత్తనం ఉండొద్దని తెలిపింది. రోడ్ల నిర్మాణం, తాగు నీటి సౌకర్యం కల్పిస్తామని వాగ్దానాలు చేయవద్దని సూచించింది. ఉద్యోగుల బదిలీలపై పూర్తి నిషేధం ఉంటుంది.
- మంత్రులు ఎన్నికల అధికారులను పిలవకూడదు. ప్రైవేటు పనిపై వచ్చిన మంత్రులను ఏ అధికారి కలవకూడదని పేర్కొంది. మంత్రులు పైలెట్ కార్లు, ఎర్రబుగ్గ కార్లు ఉపయోగించకూడదని, ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరు చేయొద్దని తెలిపింది.
- కొత్త పనులు చేపట్టకూడదని, కొత్త పనులకు ఆమోదం తెలపకూడదని ఎన్నికల సంఘం జారీ చేసిన మర్గదర్శకాల్లో పేర్కొంది. కోడ్ అమల్లో ఉంది కాబట్టి ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని పేర్కొంది. లేని పక్షంలో ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపింది.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలి



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్

హిమాయత్‌నగర్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులకు ఇంజనీరింగ్ కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నాయన్నారు. శనివారం జాతీయ బీసీ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీసీ గ్రాడ్యుయేట్లు, డిగ్రీ విద్యార్థులకు, బ్యాంకింగ్ కోసం ఉచిత కోచింగ్ అందించి, బీసీ స్టడీ సర్కిల్ బడ్జెట్ రూ. 15,000 కోట్లకు పెంచాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ కోర్సుల స్కాలర్‌షిప్‌లను రూ. 5000 నుంచి 25,000 వరకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. నేతలు భిక్షపతి యాదవ్, బాలరాజ్ గౌడ్, మల్లేష్, వెంకటాద్రి, జగదీష్ చారి, వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పాత కక్షలతో పరస్పరం దాడి: ఇద్దరికి గాయాలు

కాచిగూడ: పాత కక్షలతో ఒకరిపై ఒక్కరూ మద్యం బాటిళ్లు, కత్తితో దాడి చేసుకోవడంతో ఇరువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి, ఎస్ఐ నరేష్ కుమార్ సమాచారం మేరకు... మౌలానా ఆజాద్ నగర్‌లో నివాసముంటున్న రాహుల్(27) బ్యాండ్ వాయిస్తాడు. గోల్నాక కూరగాయల మార్కెట్‌లో స్నేహితుడు భరత్ నివాసం ఉంటున్నాడు. రాహుల్ భరత్ ఇంటికి వెళుతుండగా మధ్యలో సందీప్ (25) అనే పాత మిత్రుడు కలిశాడు. ఇద్దరి మధ్య గతంలో గొడవలు జరిగాయి. భరత్ ఇల్లు ఎక్కడ అని సందీప్‌ను అడగగా ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. దీంతో సందీప్ సోదరులు సాయి(29) దుర్గాప్రసాద్(27) లు రాహుల్‌ను మద్యం బాటిల్‌తో తలపై కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో రాహుల్ కూడా సందీప్‌పై కత్తితో దాడిచేసి గాయపరిచాడు. ఇరువురికి గాయాలయ్యాయి. రాహుల్ ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనిపై దాడికి పాల్పడిన సందీప్, సాయి, దుర్గాప్రసాద్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాహుల్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపారు.

బీజేపీ అభ్యర్థుల విజయమే లక్ష్యం కావాలి



చిక్కడపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలని బీజేపీ బీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోవా లక్ష్మణ్ పిలుపునిచ్చారు. శనివారం రాత్రి బోలక్‌పూర్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఓబీసీ సామాజిక సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ... ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజకు వివరిస్తూ ప్రతిపక్ష పార్టీల వైఫల్యాలను వివరిస్తూ ప్రచారం విస్తృతం చేయాలని అన్నారు. గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ పోలింగ్ బూత్ కో ఆర్డినేటర్లకు ఎన్నికల కార్యాచరణ పై దిశా నిర్దేశం చేశారు. నేతలు పూసరాజు, సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, అసెంబ్లీ కన్వీనర్ రమేష్ రామ్, గోపాల్, శ్రీకాంత్, దామోదర్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోనే బీసీలకు ప్రాధాన్యం



జి.ఆనంద్‌గౌడ్

అంబర్‌పేట: కాంగ్రెస్ పార్టీకి బీసీల గురించి మాట్లాడే అర్హత లేదని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌గౌడ్ అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ బీజేపీ బీసీలకు చేసిందేమీ లేదని, అగ్రకులాల వారిది బీజేపీ అని మాట్లాడటం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనం అని ఆనంద్‌గౌడ్ మండిపడ్డారు. దేశ చరిత్రలో బీసీలకు కేంద్రంలో 27 మంత్రి పదవులు బీజేపీ ఇచ్చిందని ఆనంద్‌గౌడ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీసీలకు బీసీ కుల వృత్తుల అభ్యున్నతి కోసం పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశ పెట్టి లక్షాలది మందికి వృత్తి శిక్షణ ఇచ్చి రుణ సదుపాయాన్ని కల్పించందన్నారు. విదేశాల్లో చదువుకునే పేద విద్యార్థులకు, సైనిక పాఠశాలల్లో రిజర్వేషన్‌లు కల్పించిన విషయాన్ని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గమనించాలని ఆయన హితవు పలికారు. బలహీన వర్గానికి చెందిన కర్పూరి ఠాకుర్‌కు బీజేపీ ప్రభుత్వం భారతరత్న అవార్డు అందించి గౌరవించిన విషయాన్ని రాష్ట్ర మంత్రి విస్మరించడం విచారకరం. బీసీలను విస్మరించిన చరిత్ర కాంగ్రెస్‌కే చెల్లుతుందని ఆయన విమర్శించారు.

వందేభారత్ సినిమాతో సమాజానికి ఉత్తమ సందేశం



చిక్కడపల్లి: వందేభారత్ సినిమాతో సమాజానికి ఉత్తమ సందేశం ఇచ్చారని చర్లపల్లి సెంట్రల్ జైల్ డిప్యూటీ సూపరింటెండెంట్ దార్ల కాళిదాసు అన్నారు. శనివారం రాత్రి సాంస్కృతిక సంఘసేవా సంస్థ కళానిలయం ఆధ్వర్యంలో వందే భారత్ చిత్ర యూనిట్‌కు త్యాగరాయ గానసభలో నిర్వహించిన సత్కార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ రంగాల నుంచి ఎంపిక చేసిన పలువురు ప్రముఖులకు ఛత్రపతి శివాజీ స్ఫూర్తి పురస్కారాలను ప్రదానం చేశారు. మొదట నిర్వహించిన సినీ సంగీత విభావరిలో గాయనీగాయకులు పాల్గొని ఎంపిక చేసుకున్న చిత్ర దర్శకుడు మల్లం రమేష్, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, సామాజికవేత్త వీరభోగ వసంత రాయలు, ప్రముఖులు సురేందర్, జ్యోతి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీల్లో రూ. 5 లక్షల స్వాధీనం

చిక్కడపల్లి: ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనంపై బ్యాగ్‌లో తరలిస్తున్న రూ. 5 లక్షలను దోమలగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దోమలగూడ ఏసీపీ మొగలయ్య, ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, డీఐ ఎం.వరప్రసాద్, ఎస్ఐ.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాత్రి హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న బర్కత్‌పురాకు చెందిన వ్యాపారి విజయ భాస్కర్(35)ని తనిఖీ చేశారు. అతని వద్ద ఉన్న బ్యాగ్‌లో రూ. 5 లక్షలు లభించాయి. వాటికి సరైన ధ్రువపత్రాలు చూపించనందున రూ. 5 లక్షలను సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేలో 71 మంది పదవీ విరమణ



అడ్డగుట్ట: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్‌లో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 71 మంది ఉద్యోగులు శనివారం పదవీ విరమణ పొందారు. హెడ్‌క్వార్టర్స్, సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లతో పాటు లాలాగూడ వర్క్‌షాపులో వీరు పని చేశారు. పదవీ విరమణ చేసిన అధికారులు, ఉద్యోగులకు ఈ సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. వివిధ కార్మిక సంఘ నాయకులు షేక్ రవూఫ్, ఏజీకే. మూర్తి, చింతకుంట రామకృష్ణ అకౌంట్స్ విభాగంలో పదవీ విరమణ చేసిన వారిని శాలువాతో సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు.



ప్రొ.వర్ధినికి వీడ్కోలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సైన్స్ కాలేజీ ఫిజిక్స్ డిపార్టుమెంట్ ప్రొ.వర్ధిని ఉద్యోగ విరమణ సందర్భంగా అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. శనివారం ఫిజిక్స్ విభాగం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ ప్రొ.వీరయ్య అధ్యక్షత వహించగా సీనియర్ ప్రొ.అప్పారావు, సైన్స్ డీన్ ప్రొ.కరుణసాగర్, చీఫ్ వార్డెన్ డాక్టర్ కొర్రెముల శ్రీనివాస్ రావు తదితరులు ప్రొ.వర్ధినిని సన్మానించి ఆమె సేవలను కొనియాడారు.

పార్శిగుట్ట రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలి



ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్‌లోని రాంనగర్ నుంచి పార్శిగుట్ట రోడ్డుకు వెళ్లే మార్గంలో రోడ్డును తవ్వి అలాగే వదలడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ జీహెచ్ఎంసీ అధికారులను డిమాండ్ చేశారు. శనివారం ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు నర్సింగ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానికులు ఎమ్మెల్యే గోపాల్‌ను కలిసి పార్శిగుట్ట రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ రోడ్డు నిర్మాణ పనులు, డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. అధికారులు కాలయాపన చేయకుండా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి త్వరితగతిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. స్థానిక నాయకులు రవీందర్, చంద్రశేఖర్, మోహన్‌రావు, నర్సింహ, డేవిడ్, రంగప్ప, రవి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలి



పట్టణ ప్రజల వేదిక సమావేశంలో మేనిఫెస్టోను విడుదల చేస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కార్మికుల హక్కులను పరిరక్షించడంతో పాటు వారికి సామాజిక భద్రత, భరోసా కల్పించాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. ప్రతి రాజకీయ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో పట్టణ శ్రామిక ప్రజలకు నివాస ఉపాధి హక్కులను కల్పిస్తామని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ పట్టణ ప్రజల వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ... నగరంలోని పేద ప్రజల ఇళ్లను బలవంతంగా కూల్చివేయడం సరైంది కాదని అలా కూల్చివేయమని తమ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇవ్వాలని కోరారు. పేదలకు నగరంలోనే నివాసం కల్పించాలని కోరారు. పునరావాసం పేరుతో నగరం బయటకు బలవంతపు తరలింపును నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి పట్టణ వనరులను పరిరక్షించాలని, పట్టణ జీవనోపాధి హామీ చట్టం అమలులోకి తీసుకురావాలని, గౌరవ ప్రదంగా జీవనోపాధికి భరోసా కల్పించాలని కోరారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోని అన్ని రంగాల్లో పట్టణ కార్మికులందరికి న్యాయపరమైన హక్కులను కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘాల నాయకులు సయ్యద్ ఫిరోజ్, పులి కల్పన, జాన్, ఇందిరా వినయ్, నవీన్ పాల్గొన్నారు.

మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శం



నాటికలో పాల్గొన్న కళాకారులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భారత దేశ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికే తలమానికం అని ఆచార్య చింత గణేష్ అన్నారు. శనివారం భక్తి సాహిత్య సంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో తులసీ భవన్ స్వర్ణోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్త్రీలు ఎదుర్కొంటున్న వివక్షతలపై నిర్వహించిన నాటిక విశేషంగా ఆకట్టుకుంది. ఆచార్య చింత గణేష్ మాట్లాడుతూ... సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఉత్తేజ పరుస్తాయన్నారు. ప్రముఖ రంగ స్థల నటుడు ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్‌బీఐ అధికారి శివంగికుమార్, ప్రొఫెసర్ వందన, జంగయ్యగౌడ్, వెంకటచారి, డాక్టర్ ముదిగొండ భవానీ, డాక్టర్ ఉన్నీసాబేగం తదితరులు పాల్గొన్నారు. అనంతరం నాటిక పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందజేశారు.

రద్దీ ప్రాంతాలే టార్గెట్..



- సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్ దొంగల హల్‌చల్
- ప్రతిరోజూ పదుల సంఖ్యలో మాయం
- పట్టించుకోని పోలీసులు

సుల్తాన్‌బజార్: సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్ దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. రద్దీగా ప్రాంతాలే టార్గెట్ చేసుకొని ముఠాలుగా ప్రయాణికుల, కొనుగోలుదారుల సెల్‌ఫోన్లను దొంగలిస్తున్నారు. ఈ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 94 బస్‌స్టాప్, జైన్ మందిర్, కోఠి ఉమెన్స్ కళాశాల తదితర ప్రాంతాల్లో సెల్‌ఫోన్ దొంగల ముఠా సంచరిస్తూ దృష్టి మళ్లిస్తూ ప్రయాణికుల సెల్‌ఫోన్లు తస్కరిస్తున్నారు. ప్రతిరోజూ పదుల సంఖ్యల్లో సెల్‌ఫోన్లు మాయమవుతున్నా పోలీసులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం.

ప్రతిరోజూ పదుల సంఖ్యలో సెల్‌ఫోన్లు చోరీ

సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రతిరోజూ ఇప్పటి వరకు 40 సెల్‌ఫోన్లు చోరీ కావడం పరిపాటిగా మారింది. ఒకొక్క దొంగ కనీసం ఐదు ఫోన్లు చోరీ చేయందే ఇంటికి వెళ్లలేని పరిస్థితి ఉంది. పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రతిఒక్క సెక్టార్‌కు ఓ ఏఎస్ఐ ఉన్నా వారు మాత్రం చిన్న చిన్న కేసులపై దృష్టి సారించి దొంగలను పట్టుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. పోలీసుల నిఘా వైఫల్యం వల్లే చోరీలు అధికమవుతున్న పోలీసులు పట్టించుకోకపోవడం వల్లే దొంగలు యథేచ్ఛగా చోరీలు చేసి చోరీ చేసిన ఫోన్లను ఇతర రాష్ట్రాలకు సులువుగా తరలిస్తున్నారు.

కేసులు ఫుల్ రికవరీ నిల్..

సుల్తాన్ బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగిలించబడ్డ సెల్‌ఫోన్లు రికవరీ కావడం లేదు. దొంగలు ఎంతో నేర్పుగా ఈఎంఐ నెంబర్‌తో పాటు సెల్‌ఫోన్లను మార్చుతుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక్కడ సెల్‌ఫోన్లు పోవడం సర్వ సాధరణమైంది. కేసులు మాత్రం పెరుగుతున్నా రికవరీ మాత్రం కావడం లేదని విమర్శలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు నూతన టెక్నాలజీని ఉపయోగించుకుని పోయిన సెల్‌ఫోన్లు తెచ్చి ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు.